## క్లుప్తంగా

### మైనార్టీ పాఠశాలలో ప్రవేశాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఇమామ్, మౌజాన్‌లు

**హుస్నాబాద్:** మైనార్టీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యలక్ష్మి తెలిపారు. పాఠశాలలో వివిధ గ్రామాల్లోని ఇమామ్‌లు, మౌజాన్‌లతో కలిసి సోమవారం అడ్మిషన్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీ పాఠశాలలో 5 నుంచి 8వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులల్లో మైనార్టీ బాలికలకు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జామా మసీద్ ప్రధాన కార్యదర్శి ఎండీ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

**నంగునూరు(సిద్దిపేట):** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని యజమానులపై కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసిఫ్, ప్రొబేషనల్ ఎస్ఐ సౌజన్య తెలిపారు. కొహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన పొన్నాల ఎల్లయ్య, చామంతుల బాలరాజు రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా సిద్దన్నపేట వద్ద తనిఖీ చేశామని, ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి తహసీల్దార్‌కు అప్పగించామని వారు చెప్పారు.

### భూ సేకరణకు సహకరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

**హుస్నాబాద్:** గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కాలువల నిర్మాణానికి గాను చేపట్టిన భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీఓ రామ్మూర్తి కోరారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఎడమ కాలువ భూ సేకరణ నిమిత్తం సోమవారం కోహెడ మండలం నారాయణపూర్, నకిరేకొమ్ముల, వింజపల్లి, సముద్రాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరణలో భాగంగా కోల్పోతున్న భూమి, ఇళ్లు, పైపులైన్లు, పశువుల కొట్టాలు, చెట్లను గుర్తించామన్నారు. నష్టాలు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. ఇరిగేషన్‌శాఖ డీఈ రేష్మ, ఏఈఈ శ్రీనాథ్, డిప్యూటీ తహసీల్దార్ అరవింద్ తదితరులు ఉన్నారు.

### సేవలు మరవలేం..



అధికారి జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**అక్కన్నపేట(హుస్నాబాద్):** గ్రామాభివృద్ధికి ఎంతో కృషిచేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జైపాల్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఆయనను మండలంలోని రామవరంలో ఎంపీటీసీ సభ్యు డు లింగాల శ్రీనివాస్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలో పనిచేసి పదవి విరమణ పొందిన అధికారి గ్రామంలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరాస్వామి, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేందర్, ప్రసాద్ పాల్గొన్నారు.

### సదుపాయాలు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**మర్కూక్(గజ్వేల్):** ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని మండల విద్యాధికారికి పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు 50 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్, నాగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలకిషన్, రమణారావు, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

# నడవాలంటే నరకమే..

**ధ్వంసమైన మట్టిరోడ్లు**
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీ రోడ్లు వేయాలని వేడుకోలు



కుకునూరుపల్లి శివారులో కలకలమ్మ చెరువుకట్టపై ధ్వంసమైన మట్టిరోడ్డు

**పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దుతామన్న పాలకుల మాటలు నీటి మూటలుగా మిగిలి పోతున్నాయి. అభివృద్ధికి కీలకం రోడ్లు. ఇంకా చాలా గ్రామాల్లో ప్రజలు మట్టి రోడ్లతోనే పాట్లు పడుతున్నారు. అవి ధ్వంసమై గోతులు ఏర్పడటంతో ప్రయాణం నరకయాతనగా మారింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించవలసి వస్తోందని పలుగ్రామాలు ప్రజలు వాపోతున్నారు.**

**కొండపాక(గజ్వేల్):** కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో మట్టిరోడ్ల దుస్థితి తీరు చాలా దారుణంగా ఉంది. మండలంలోని ఖమ్మంపల్లి నుంచి బండారుపల్లి వరకు, అలాగే సిర్సనగండ్ల నుంచి గిరాయిపల్లికి వెళ్లే దారిలో ఉన్న వైకుంఠధామం వరకు, అలాగే కుకునూరుపల్లిలోని కలకలమ్మ చెరువుకట్ట నుంచి బొబ్బాయిపల్లి వరకు ఉన్న మట్టిరోడ్లు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఆటంకంగా మారాయి.

**ప్రారంభంకాని పనులు**

బొబ్బాయిపల్లి నుంచి కొండపోశమ్మ తల్లి దేవాలయం వరకు, అలాగే కుకునూరుపల్లి నుంచి కలకలమ్మ చెరువుకట్ట మీదుగా బొబ్బాయిపల్లి శివారులో కొండపోశమ్మ తల్లి దేవాలయం వరకు ఉన్న మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా నిర్మించేందుకు గతంలోనే రెండు దపాలుగా నిధులు మంజూరయ్యాయి. అయినా టెండర్ ప్రక్రియ మాత్రం పూర్తికాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

**పూర్తిగా ధ్వంసమైన రోడ్లు**

ఖమ్మంపల్లి నుంచి బండారుపల్లి వరకు వెళ్లే మట్టి రోడ్డులో ఏర్పడిన గుంతల్లో వర్షపునీరు నిలిచి ప్రయాణం కష్టతరంగా మారిందంటూ స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టిరోడ్ల స్థానంలో బీటీ రోడ్లను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ప్రయాణానికి ఆటంకం**

అసలే మట్టిరోడ్డు దానికితోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కలకలమ్మ చెరువుకట్టపై లోతైన గుంతలు పడ్డాయి. దీంతో రాకపోకలకు ఆటంకంగా మారింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు గజ్వేల్, తుప్రాన్ నుంచి నిత్యం వందలాది వాహనాలు కొండపోచమ్మ తల్లి దేవాలయం వరకు వెళ్లేందుకు ఈ దారే శరణ్యం. రాత్రివేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుతురులో దారి కనబడకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



ఖమ్మంపల్లి నుంచి బండారుపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో చేరిన వర్షపునీరు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్న జీయర్ స్వామి

## వైభవం.. స్వర్ణోత్సవం

**నేడు ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** మోహినిపుర పద్మావతి సమేత వేకంటేశ్వరస్వామి ఆలయ స్వర్ణోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం ధన్వంతరి ఇష్టి, చూర్ణోత్సవం, స్వామివారి ఎదుర్కోలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు, హోమాలతో ఆలయ ఆవరణ అలరారింది. రాత్రి త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ఆలయాన్ని సందర్శించారు. మంగళవారం ఆలయ ఆవరణలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం జరుగనుంది. అందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## రైతుల కోసమే నూతన ట్రాన్స్‌ఫార్మర్

**పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ రెడ్డి**

**దౌల్తాబాద్(దుబ్బాక):** రైతుల మేలు కోసమే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని పీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్ కుమార్‌రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని ముబారస్‌పూర్ శివారులో 132.33కేవీ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 31.5 ఎంటీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16కేవీలలో లో ఓల్టేజీతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, దానిని తొలగించి, దాని స్థానంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సహకారంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ, స్వామి, బుచ్చి రెడ్డి, షాదుల్లా, చారి రాము, రవీందర్‌రెడ్డి, వెంకటి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న శ్రావణ్‌కుమార్ రెడ్డి

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం

**బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్:** ధాన్యం కొనుగోళ్లలో దేశంలోనే ప్రథమ స్థానంలోఉన్నామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెబుతున్నారని, కాని క్షేత్రస్థాయిలో పూర్తిగా వైఫల్యం చెందారని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో వేలాది క్వింటాళ్ల ధాన్యం రోడ్లపైనే ఉందన్నారు. కొనుగోళ్ల ఆలస్యం కావడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కొనుగోళ్లను వేగంగా చేపట్టారని, దానికితోడు లారీలను సమకూర్చడం లేదని వాపోయారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత కూడా ఉందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. వానలు కురుస్తున్న తరుణంలో రైతులకు కొనుగోళ్లలో ఇబ్బందులు తొలగకపోవడం ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుంటుకు రాజు, మర్కంటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య**

**తొగుట(దుబ్బాక):** పోచమ్మ తల్లి దయతో ప్రజలు సుభిక్షితంగా ఉండాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని లింగాపూర్‌లో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో కళకళలాడాలని వారు ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డిని, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, మల్లారెడ్డి, అశోక్, నరేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న వెంకటయ్య

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు

**రూరల్ సీఐ శ్రీను**



**బెజ్జంకి(సిద్దిపేట):** ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక, మట్టిని తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను హెచ్చరించారు. సోమవారం ఆయన బెజ్జంకి పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. మైనర్‌లకు వాహనాల ఇవ్వొద్దని, ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో ఏఎస్ఐ శంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

**అధికారుల సహకారం**

అభివృద్ధి పనుల పేరుతో అధికారులు ఇసుక అక్రమ రవాణాలకు సహకరిస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. బెజ్జంకిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అలాంటి వారిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లక్ష్మణ్, తిరుపతి, రాజయ్య, తిరుపతిరెడ్డి, దేవయ్య, శేఖర్‌బాబు, మల్లేశం, మోహన్, రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుకు వయస్సుతో సంబంధం లేదు

**దౌల్తాబాద్(దుబ్బాక):** చదువుకు వయస్సుతో సంబంధం లేదని దొమ్మాట ఉన్నత పాఠశాల హెచ్ఎం బాసిత్ అన్నారు. సోమవారం ఆయన ఉల్లాస్ కార్యక్రమం గురించి ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకు దూరమైన వయోజనులు తిరిగి తమ చదువును కొనసాగించడానికి ఈ ఉల్లాస్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ ఇంటి వద్ద కాని, వీధిలో, గ్రామ పంచాయతీ ప్రాంగణంలో కాని తమకు అనుకూలంగా ఉన్న చోటనే చదువును కొనసాగించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి భిక్షపతి, ప్రశాంత్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిర, శ్యామల, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న హెచ్ఎం బాసిత్

## ‘అలయన్స్’ చైర్‌పర్సన్‌గా వనజ



**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** ఈ సంవత్సరాలనికి గాను అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్ పర్సన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక సేవకురాలు సోమ వనజను నియమిస్తూ ఆ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్‌కే సక్సేనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీకి చైర్ పర్సన్‌గా ఒక మహిళ నియమితులవ్వడం ఇదే తొలిసారి. ఇప్పటికే వనజ వాసవి, వనిత క్లబ్‌ల తరపున పేదలకు అనేక సేవలందించారు. ఈ సందర్భంగా ఆమెకు క్లబ్ జిల్లా కన్వీనర్ గందె ఈశ్వర్ చరణ్, ఆత్మరాములు, వాసవిక్లబ్, వనితక్లబ్, ఆర్యవైశ్య మహాసభ సభ్యులు అభినందనలు తెలిపారు.

## మత్తు జోలికి పోతే జీవితాలు చిత్తు

**సీఐ శ్రీనివాస్**



**దుబ్బాకటౌన్:** యువత డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ఆన్‌లైన్ గేమ్స్, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన కొంత మంది యువతి, యువకులు వారి జీవితాలను చిత్తు చేసుకుని తల్లిదండ్రులకు ఆవేదన మిగులుస్తున్నారన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల నడవడికను తల్లిదండ్రులు గమనించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా జరిగే ప్రమాదాలకు తల్లిదండ్రులదే బాధ్యత అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే, జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. త్వరలోనే డీజే బాక్సుల యజమానులతో సమావేశం నిర్వహించి డీజే ధ్వనులను కట్టడి చేస్తామన్నారు.

## అనుమతిలేని పాఠశాలను మూసివేయాలి

**ప్రజావాణిలో ఏఐఎస్ఎఫ్ నాయకుల ఫిర్యాదు**

**చేర్యాల(సిద్దిపేట):** ప్రభుత్వ అనుమతి లేకుండా పట్టణ కేంద్రంలో కొనసాగిస్తున్న శ్రీచైతన్య పాఠశాలను వెంటనే మూసివేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ మాట్లాడుతూ రెండేళ్లుగా నడుస్తున్న ఆ పాఠశాలపై విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. స్థానిక ఎంఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల యాజమాన్యానికే మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. గతంలో మూతబడ్డ స్కూల్ పేరిట పాఠశాల నడిపిస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులకు గత పరీక్షల్లో మూతపడ్డ శుభోదయ స్కూల్ పేరిట హాల్ టికెట్లు జారీచేశారని వాపోయారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోని విద్యాశాఖ అధికారులపైనా, ఆ పాఠశాల యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పాఠశాలను మూసివేసి అందులో చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎస్‌కే యాసిన్, గిరిక అభినయ్ ఉన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



రైతులతో వ్యవసాయాధికారి మోహన్

**తొగుట(దుబ్బాక):** ఆయిల్‌పామ్ సాగుచేసి అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయాధికారి మోహన్ రైతులకు సూచించారు. మండలంలోని కాన్గల్ గ్రామ రైతు తరిగొప్పుల లక్ష్మి సాగుచేసిన ఆయిల్‌పామ్ తోటలో గెలలు తీయడాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 375 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారన్నారు. తోటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నామని చెప్పారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుచేసి అంతర పంటగా కూరగాయలు, పూల తోటలు సాగుచేసుకుంటే అదనపు ఆదాయం సమకూరుతుందని, అలాగే డైరీ, గొర్రెలు, కోళ్ల పెంపకంపై కూడా దృష్టి సారించాలని సూచించారు. సిఫారసు మేరకే యూరియా వాడాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** పట్టణంలోని 11కేవీ హనుమాన్‌నగర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌నగర్, ముస్తాబాద్ చౌరస్తా, ఎరుకల గడ్డ, సాయిబాబా ఆలయ ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

**రూరల్ మండల పరిధిలో**

సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్ ఇండస్ట్రీయల్, అగ్రికల్చర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని టవర్‌ల మరమ్మత్తుల కారణంగా ఇర్కోడ్ గ్రామం, ఇండస్ట్రీయల్ ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసులు తెలిపారు.

**◆ జాబ్‌కార్డులు నిలిపివేయడం సరికాదు**

**గజ్వేల్‌రూరల్:** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు సాకుతో ఉపాధి హామీ కూలీలకు జాబ్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేయడం సరికాదని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నిలిపివేసిన జాబ్‌కార్డులను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. అదే విధంగా పని ప్రదేశాలలో నీరు, నీడ, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. పార, గడ్డపార, గంపలను అందించాలని, వేసవి అలవెన్స్‌ను తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

**◆ పిడుగుపడి పాడి గేదె మృతి**

**అక్కన్నపేట(హుస్నాబాద్):** పిడుగుపడి ఓ పాడి గేదె మృత్యువాత పడింది. ఈ ఘటన మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కాసర్ల రమేశ్‌కు చెందిన పాడిగేదెను ఎప్పటిలాగే తన వ్యవసాయ క్షేత్రంలోని పశువుల పాకలో కట్టి ఉంచాడు. ఒక్కసారిగా పిడుగు పడడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారుగా రూ.70 వేలు ఉంటుందని, ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

**◆ కాడెద్దు చోరీ**

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** గుర్తుతెలియని దుండగులు కాడెడ్లను ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన గణేశ్, అనంతసాగర్‌కు చెందిన రైతు కనకయ్య తమ పొలాల వద్ద పశువుల పాకలో ఆదివారం రాత్రి ఎద్దులను కట్టేశారు. సోమవారం తెల్లవారుజామున చూసేసరికి ఎద్దులు లేకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల్లో వెతికారు. ఎక్కడ ఆచూకి లేకపోవడం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

**◆ భూ అక్రమాలపై విచారణ జరిపించాలి**

**సిద్దిపేటకమాన్:** కబ్జాకు గురైన ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేయాలని చూసినా ఊరుకునేది లేదన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని చౌదరిపల్లిలో ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.

**◆ బాధిత కుటుంబానికి బీమా అందజేత**

**గజ్వేల్‌రూరల్:** అంబులెన్స్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ అండగా నిలుస్తుందని 108 సంస్థ ప్రతినిధులు సుధాకర్, కిరణ్‌కిశోర్ తెలిపారు. గజ్వేల్ 108 వాహనంలో ఈఎంటీగా విధులు నిర్వహించిన బోయిన నవీన్ ఇటీవల మృతి చెందాడు. దీంతో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆ సంస్థ నుంచి రూ.5లక్షలు అందించారు.

**◆ పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి**

**దుబ్బాక:** ప్రముఖ కమ్యూనిస్టు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, నవీన, కొంపల్లి భాస్కర్, సాజిద్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

**◆ హన్‌మాన్ మాలధారుల పాదయాత్ర**

**నంగునూరు(సిద్దిపేట):** హన్‌మాన్ మాల ధరించి స్వాములు సోమవారం నంగునూరు నుంచి కొండగట్టుకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు పాదయాత్ర చేసి హన్‌మాన్ జయంతి రోజున మాల విరమణ చేస్తామన్నారు.

**◆ 200 మందికి నేత్ర వైద్య పరీక్షలు**

**మద్దూరు(హుస్నాబాద్):** మండల కేంద్రంలో సోమవారం శంకరయ్య కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మండల వైద్యధికారి రజిత మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వస్తున్న శంకరయ్య ఆస్పత్రి సేవలు అభినందనీమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

**◆ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ**

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఎంఈఓ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 24 వరకు బాలికల పాఠశాలలో పాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో హెచ్ఎం శంకర్, సీఆర్‌పీలు దయానంద్, భాస్కర్, శివప్రసాద్, రమణ, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

**◆ తిరంగా ర్యాలీ రేపు**

**హుస్నాబాద్:** భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై హర్షిస్తూ మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్టు విశ్రాంత ఉపాధ్యాయుడు గౌరిశెట్టి ప్రకాశ్ తెలిపారు. స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ సంఘాలు, అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ గాంధీ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహిసున్నట్లు తెలిపారు.

**◆ మిత్రుడి కుటుంబానికి సాయం**



**దుబ్బాక:** గుండెపోటుతో మరణించిన తన స్నేహితుడి కుటుంబానికి బాల్యమిత్రులు అండగా నిలిచారు. లచ్చపేటకు చెందిన మలిపెద్ది రమేశ్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. విషయం తెలుసుకున్న స్నేహితులు రమేశ్ కుటుంబ సభ్యులకు సోమవారం రూ.56,116 అందించారు. కార్యక్రమంలో ఉస్మాన్, షాదుల్, శ్రీరాములు, శ్రీనివాస్, నాగేందర్, సుధాకర్, రఘునాథ్, బాలకిషన్, వేణు, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.